# ప్రజాశక్తి

సోమవారం 3 జూన్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

# భారీ వర్షం

◆ విశాఖ, అనకాపల్లిల్లో రోడ్లు జలమయం

◆ పిడుగులు పడి ఇద్దరు మృతి



నందగిరి నగర్‌లో కారుపై విరిగిపడిన చెట్టు



చావులమధుం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

ప్రజాశక్తి - సీతమ్మధార, ఎంవిపి.కాలనీ


విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆదివారం ఉదయం, సాయంత్రం పలుచోట్ల ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా విశాఖ నగరంలోని అక్కయ్యపాలెం, జగదాంబ, వన్‌టౌన్, మద్దిలపాలెం, శివాజీపాలెం, కంచరపాలెం, జ్ఞానాపురం, గాజువాక ప్రాంతాల్లో కురిసిన వానకు రోడ్లు జలమయమయ్యాయి. ఈదురుగాలులకు నందగిరినగర్ కాలనీలో చెట్టు కూలి కారుపై పడ్డంతో వాహనం పాక్షికంగా ధ్వంసమైంది. చావులమధుం సహా పలు లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరింది.

**మత్స్యకారుల ఇంట విషాదం**

విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం తెల్లవారుజామున 5:20 గంటలకు పిడుగుపడి దుమ్ము పోలరాజు (23) మృతిచెందాడు. గాయపడ్డ మైలపల్లి గురయ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పోలరాజు, కర్రి అప్పన్న, మైలపల్లి గురయ్యలు కలిసి సంప్రదాయ బోటుపై చేపలవేటకు బయలుదేరుతుండగా ఫిషింగ్ హార్బర్ నాలుగో జెట్టీ వద్ద పిడుగుపడింది. ఈ ప్రమాదంలో పోలరాజు, గురయ్యలు గాయపడ్డారు. అప్పన్న తృటిలో ప్రమాదం నుంచి మిగతా 2లో..



పోలరాజు మృతదేహం



ముత్యాలు (ఫైల్‌ఫొటో)





పోస్టల్ బ్యాలెట్ల తరలింపు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున

# పోస్టల్ బ్యాలెట్ల తరలింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పోలైన పోస్టల్ బ్యాలెట్లను ఎయు ఇంజినీరింగ్ కళాశాల పరిధిలోని ఇసిఇ బ్లాక్ నుంచి ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లకు ఆదివారం తరలించారు. ఫెసిలిటేషన్ కేంద్రాల ద్వారా ఉద్యోగులు వేసిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఎన్నికల అనంతరం ఎయులోని ఇసిఇ బ్లాక్‌లో భద్రపరిచిన విషయం తెలిసిందే. ఈ నెల 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అనుగుణంగా ఆయా ఓట్లను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల సమక్షంలో విభజించి వాటిని ఆదివారం ఉదయం పటిష్ట భద్రత నడుమ ఆయా స్ట్రాంగ్ రూమ్‌లకు తీసుకెళ్లారు. ఎస్.కోట పరిధిలో విశాఖ లోక్‌సభ స్థానానికి పోలైన ఓట్లను కూడా ఆదివారం ఉదయం అక్కడ నుంచి ఇక్కడికి తీసుకొచ్చారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని రకాల చర్యలూ తీసుకొని అభ్యర్థుల సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. మొత్తం ప్రక్రియను నిబంధనలను అనుసరించి వీడియోగ్రఫీ చేశారు. అదేవిధంగా సర్వీస్ ఓటర్లు పంపించిన ఇటిపిబిఎస్ మిగతా 2లో..

## భూముల స్వాహాపై సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు జరపాలి

▶ వార్త మెయిన్‌లో..

## 'ఉక్కు' పరిరక్షణకు ఎంతటి పోరాటానికైనా సిద్ధం

▶ వార్త మెయిన్‌లో..

## టోల్‌ప్లాజా రేట్లు పెంచడం దారుణం

▶ వార్త 3లో..



ఆగ్నేశమ్మ భౌతికకాయం వద్ద నివాళ్లర్పిస్తున్న ప్రముఖులు

# జాలాది సతీమణికి కన్నీటి వీడ్కోలు

సినీ, కళారంగ ప్రముఖుల అశ్రునివాళి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రముఖ సినీ గేయ రచయిత, కళా ప్రపూర్ణ డాక్టర్ జాలాది రాజారావు సతీమణి ఆగ్నేశమ్మ (82) అంతిమయాత్ర ఆదివారం అశ్రు నయనాల నడుమ సాగింది. కృష్ణా జిల్లా నందిగామలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఆమెకు కుమారుడు శ్రీనివాసరావు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. జాలాది సాహిత్యంపై పరిశోధన చేసిన డాక్టర్ విజయ ఆమె కుమార్తె. ఆగ్నేశమ్మ పార్థివ దేహాన్ని మర్రిపాలెం శాంతినగర్‌లోని ఆమె ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని క్రైస్తవ వాటికకు మిగతా 2లో..

లెక్కింపు కేంద్రం వద్ద

# పటిష్ట పోలీసు బందోబస్తు

◆ అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తం ◆ అదుపు తప్పితే భాష్పవాయు ప్రయోగం, లాఠీఛార్జీ

◆ డ్రోన్‌లతో అల్లరి మూకల గుర్తింపు ◆ ప్రశాంత లెక్కింపునకు అందరూ సహకరించాలి: ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను జిల్లా పోలీసాధికారులు తీసుకున్నారు. నిఘా వ్యవస్థను, భద్రతను మరింత పటిష్టం చేశారు. లెక్కింపు కేంద్రం వద్ద 500 మందికిపైగా పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించారు. 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమల్లోవుంది. లెక్కింపు ప్రక్రియ జరిగే శంకరం ప్రవేశ ద్వారం, ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ వద్ద లోపలకు వచ్చే ప్రతి ఒక్కరినీ పోలీసు అధికారులు, సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు ఎన్నికల మిగతా 2లో..



భద్రతపై పోలీసులకు సూచనలిస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

**మొదటి పేజీ తరువాయి..**

## భారీ వర్షం

తప్పించుకున్నాడు. గాయపడ్డ ఇద్దరినీ హుటాహుటిన కెజిహెచ్‌కు తరలించారు. అప్పటికే పోలరాజు మరణించాడు. గురయ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నందున మెరుగైన చికిత్స కోసం ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన ఐసియులో చికిత్స పొందుతున్నాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**పరవాడ :** మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన కంబాల ముత్యాలు (48) ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో జాలరిపేట ముత్యాలమ్మపాలెం తీరంలోని జెట్టీల వద్ద అలలు ఎక్కువగా ఉన్నాయని తెలిసి తమ బోట్లును పరిశీలించేందుకు వెళ్తుండగా అకస్మాత్తుగా పిడుగుపడి మృతిచెందాడు. పరవాడ పోలీసులకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో సిఐ బాల సూర్యారావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

## లెక్కింపు కేంద్రం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు

రిటర్నింగ్ అధికారిగానీ, కలెక్టర్ జారీ చేసిన పాస్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డునుగానీ తీసుకురావాల్సివుంది. లేదంటే లోపలకు పోలీసులు అనుమతించరు. సిసి టివి కెమెరాలు, డ్రోన్, బాడీ ఓర్న్ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా ఘర్షణలకు పాల్పడిన వారిని గుర్తించి కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయనున్నారు. రౌడీషీట్ తెరవనున్నారు. అదుపు తప్పిన మూకలపై బాష్పవాయువు ప్రయోగించనున్నారు. పరిస్థితులను బట్టి లాఠీఛార్జీ చేయనున్నారు. మంగళవారం జరగనున్న లెక్కింపు సందర్భంగా రాజకీయ పార్టీలు, ప్రజలకు ఎస్‌పి కెవి.మురళీకృష్ణ శాంతిభద్రతల దృష్ట్యా కొన్ని సూచనలు చేశారు. పాటించాల్సిన నియమ నిబంధనలు తెలిపారు. లెక్కింపు పూర్తయ్యే వరకూ రెండు కిలోమీటర్లు రెడ్ జోన్‌గా ప్రకటించారు. డ్రోన్‌లు ఎగరవేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నారు. లెక్కింపు సందర్భంగా సుంకరమెట్ట జంక్షన్ నుంచి రేబాక, కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఆ రోజు ప్రత్యామ్నాయ మార్గాలలో గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్‌పి ప్రజలను కోరారు.

**ఇవీ నిబంధనలు**

లెక్కింపు రోజు కేంద్రాల వద్దకు అభ్యర్థులు, ఏజెంట్లుకు మినహా ఇతరులెవరికీ అనుమతి లేదు. ఓట్ల లెక్కింపునకు వచ్చేవారెవరూ ఆర్‌ఒ అనుమతించిన పేపర్లు మినహా మొబైల్స్, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు, అగ్గిపెట్టెలు, సిగరెట్లు, పెన్, పేపర్ వంటి వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో తీసుకురాకూడదు. లెక్కింపు కేంద్రం లోపలకు ఏజెంట్లు వెళ్లిన తరువాత లెక్కింపు పూర్తయ్యేవరకు బయటకు రాకూడదు. ఏదైనా అనారోగ్య సమస్యలు ఉంటే ముందుగానే వాటికి సంబంధించిన మందులు వెంట తెచ్చుకోవాలి. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదు. బాణసంచా కాల్చకూడదు. టపాసులు, ఇతర పేలుడు పదార్థాలను ఎక్కడా నిలువ ఉంచకూడదు. ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయి. ఏజెంట్లు తప్ప ఇతరులను మండల, నియోజకవర్గ, జిల్లా, లెక్కింపు కేంద్రానికి తీసుకురాకూడదు. సోషల్ మీడియాలో వచ్చే ఊహాజనిత వార్తలకు స్పందించకూడదు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు చేసినా, పోస్టులు పెట్టి గొడవలకు కారణమైనా సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలుంటాయి.

**ట్రాఫిక్ సూచనలు**

జాతీయ రహదారి 16 నుంచి, సుంకరమెట్ట జంక్షన్ పై నుంచి, బొజ్జన్న కొండ రోడ్డు వైపు నుంచి లెక్కింపు కేంద్రానికి వచ్చే అభ్యర్థులు, లెక్కింపు ఏజెంట్లు, మీడియా రేబాక అండర్ పాస్ నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా కలెక్టరేట్ ఆర్చ్ నుంచి లోపలకు వెళ్లాలి. లెక్కింపు అధికారులు, సిబ్బంది రేబాక అండర్ పాస్ నుంచి గోపాలపురం రోడ్డు మీదుగా బట్లపూడి విలేజ్ కాలనీ దగ్గర వాహనాలు పార్కు చేసుకొని కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి.

**పార్కింగ్ స్థలం**

కల్పనా లేఅవుట్, గొలగాం పడమర వైపు అభ్యర్థుల వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. బట్లపూడి విలేజ్ కాలనీ గుడి ప్రాంగణంలోకి లెక్కింపునకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది వాహనాలను అనుమతిస్తారు. కలెక్టరేట్ మెయిన్ గేట్ ఎదురుగా ఖాళీ స్థలాన్ని ఎలక్షన్ కమిషన్ అనుమతించిన మీడియా వాహనాలకు కేటాయించారు. కలెక్టరేట్ పక్క ఖాళీ స్థలంలో నిర్దేశించిన ప్రదేశంలో కౌంటింగ్ ఏజెంట్ల వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.

## పోస్టల్ బ్యాలెట్ల తరలింపు

పోస్టల్ బ్యాలెట్లు పోస్టల్ డిపార్టుమెంట్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయానికి చేరుకోగా ఇంత వరకూ ఖజానాలో పోలీసుల సమక్షంలో భద్రపరిచారు. వాటిని అభ్యర్థుల సమక్షంలో ఎయులోని స్ట్రాంగ్ రూమ్‌కు ప్రత్యేక వాహనం ద్వారా తరలించారు. అనంతరం వాటిని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి సీళు వేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు నియోజకవర్గ కౌంటింగ్ అబ్జర్వర్ అమిత్ శర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫక్కీరప్ప, ఎడిసి కెఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆయా నియోజకవర్గాల ఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## జాలాది సతీమణికి కన్నీటి వీడ్కోలు

అంత్యక్రియల నిమిత్తం తీసుకొచ్చారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి, సకల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, ఎల్.రమేష్, యాక్మీ ప్రతాప్ కుమార్, మేడా మస్తాన్ రెడ్డి, వర్రే నాంచారయ్య, ఎలీసా ప్రసాద్ తదితర ప్రముఖులు ఆగ్నేశమ్మ భౌతిక దేహం వద్ద పుష్పమాలలు ఉంచి నివాళులు అర్పించారు. కళాకారులు, కళా సంస్థల ప్రతినిధులు కడసారి వీడ్కోలు పలికారు.

# 57 కేసులు ఛేదించాం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మే నెలలో పోలీస్ శాఖలో నమోదైన 83 కేసుల్లో 47 కేసులను, మార్చి, ఏప్రిల్ నెలల్లో నమోదైన కేసులలో 10 కేసులను ఛేదించినట్టు విశాఖపట్నం క్రైమ్ డిసిపి పి.వెంకటరత్నం తెలిపారు. ఆదివారం ఉదయం విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మే నెలలో 83 కేసులకు సంబంధించి రూ.53,40,340 చోరీకి గురైందని, అందులో 47 కేసులను ఛేదించి రూ.28,23,200 విలువగల సొత్తును రికవరీ చేశామని ఆమె తెలిపారు. గడిచిన నెలలో 193 సీసీ కెమెరాలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా వివిధ నేరాల్లో శిక్ష పడి జైలు నుంచి విడుదలైన 31 మంది నేరస్తుపై ప్రత్యేకంగా నిఘా పెట్టామన్నారు.



స్వాధీనం చేసుకున్న సొత్తును చూపుతున్న క్రైమ్ డిసిపి వెంకటరత్నం

## అల్లూరి శత వర్ధంతి వార్షిక నిర్వహణ కమిటీ ఏర్పాటు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భాన్ని పునస్కరించుకొని ఏడాది పాటు కార్యక్రమాలు నిర్వహించేందుకు అల్లూరి శత వర్ధంతి వార్షిక నిర్వహణ కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు ఆదివారం కంచరపాలెంలో సమావేశం జరిగింది. ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర సలహాదారులు డాక్టర్ ఎన్.చంద్ర శేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా అల్లూరి సీతారామరాజు చరిత్ర పరిశోధకులు పడాల వీరభద్రరావు హాజరయ్యారు. అల్లూరి శత వర్ధంతిని ఏడాదిపాటు ఘనంగా నిర్వహించడానికి సలహాలు, సూచనలను స్వీకరించే ఉద్దేశ్యంతో జరిగిన ఈ సమావేశంలో పలువురు అల్లూరి అభిమానులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని వారి అభిప్రాయాలను తెలియజేశారు. పడాల వీరభద్రరావు ప్రసంగిస్తూ అల్లూరి జీవిత చరిత్రలోని కొన్ని అద్భుత పోరాట ఘట్టాలను తెలియజేశారు. అల్లూరి శత వర్ధంతి వార్షిక కార్యక్రమాలను నెలకు ఒకటి చొప్పున అల్లూరి జీవితంతో సంబంధమున్న వివిధ ప్రదేశాలలో నిర్వహించాలని ఆయన కోరారు. డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ అల్లూరి జీవితం, పోరాటంపై ఒక పుస్తకాన్ని ప్రచురించి విస్తృతంగా పంపిణీ చేయాలన్నారు. వ్యాసరచన పోటీలను నిర్వహించాలని సూచించారు. జులై 4న అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించడానికి కృషి చేయాలన్నారు. ఎస్.గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.





పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

**నూతన కమిటీ ఇదే..**

20 మందితో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి వార్షిక నిర్వహణ కమిటీ ఏర్పాటైంది. గౌరవాధ్యక్షులుగా పడాల వీరభద్రరావు, అధ్యక్షులుగా డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.గోవిందరాజులు ఎన్నికయ్యారు. సమావేశంలో సివంగి నాగేశ్వరరావు, శ్యామల వరలక్ష్మి, ఎం.శరత్, సిహెచ్.ప్రమీల, పి.వేంకటేశ్వరరావు, వి.నాగార్జునరాజు, పల్లా భాస్కరమణి, విద్యార్థి నాయకులు కె.అభిలాష్, బి.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్‌కు పూర్వ వైభవం'

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** కాంగ్రెస్‌కు పూర్వ వైభవం రానుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు భద్రపత్తి శ్రీనివాసరావు తెలిపారు. జగదాంబ జంక్షన్ ఎల్లమ్మ తోట వద్ద ఆధునికీకరించిన కాంగ్రెస్ నూతన కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశంలోని ప్రజలంతా కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. తప్పకుండా ఇండియా వేదిక అధికారం చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల కాంగ్రెస్ ఇంఛార్జ్ రాకేష్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సోడదాసి సుధాకర్, పార్టీ విశాఖ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొన్నారు.

## పేదల భూములు కొల్లగొట్టారు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ప్రజలకు తండ్రిలా.. రైతులకు కస్టోడియన్లగా వ్యవహరించాల్సిన ఐఎఎస్ అధికారులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, విశాఖ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున రాబందుల్లా మారి వేలమంది అమాయక ఉత్తరాంధ్ర దళిత, బిసి రైతుల భూములు లాక్కొని పొట్టగొట్టారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. దేశంలోని మిగతా ఐఎఎస్‌లకు భిన్నంగా వారు వ్యవహరించారన్నారు. ఆదివారం జిల్లా టిడిపి కార్యాలయంలో టిడిపి నేత పోతన రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మూర్తియాదవ్ మాట్లాడారు.

## ఇసి నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి**

ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాజవొమ్మంగి సిఐ సన్యాసి నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అల్లూరి జిల్లా ఎస్పీ, రంపచోడవరం ఏఎస్పీ ఆదేశాల మేరకు రాజవొమ్మంగి సీఐ సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆదివారం రాజవొమ్మంగిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజున డీజేలకు, ఊరేగింపులకు, బాణసంచా కాల్చడానికి అనుమతులు లేవని స్పష్టం చేశారు. మండలంలో అల్లర్లు సృష్టించి శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



ర్యాండమైజేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు

## కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ఈ నెల నాలుగో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన సిబ్బందిని కేటాయిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం కౌంటింగ్ అబ్జర్వర్లు, పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఇతర అధికారుల సమక్షంలో కలెక్టరేట్ విసి హాలులో ఆన్‌లైన్ విధానంలో కలెక్టర్ ఈ ప్రక్రియను నిర్వహించారు. రిజర్వుతో కలిపి 1045 మందికి ర్యాండమైజేష్ నిర్వహించగా లెక్కింపు ప్రక్రియను అవసరమైన 857 మంది సిబ్బందిని పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించారు. వారిలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు 267 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 309 మంది ఉండగా మైక్రో అబ్జర్వర్లు 281 మంది ఉన్నారు. వీరందరికీ ఈ నెల 4వ తేదీ ఉదయం మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి ఎవరు ఏ టేబుల్‌కు వెళతారో ఆయా టేబుళ్లకు కేటాయిస్తారు.

## 'దర్శిని' చిత్ర బృందానికి అభినందన

**ప్రజాశక్తి-సీతమ్మధార :** విశాఖ నగరానికి చెందిన హీరోహీరోయిన్లు, దర్శకుడుతోపాటు పలు టెక్నీషియన్లతో విశాఖ పరిసరప్రాంతాల్లో నిర్మించిన చిత్రం 'దర్శిని' మంచి ప్రజాదరణతో విజయవంతం కావడం అభినందనీయమని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ నరవ ప్రకాశరావు అన్నారు. ఆదివారం విశాఖ పౌర గ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, రంగసాయి మీడియా సంస్థల ఆధ్వర్యంలో దర్శిని చిత్రబృందాన్ని అభినందించారు. తొలుత దర్శిని సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షతన దర్శకుడు, నటీనటులను పరిచయం చేశారు. అనంతరం నరవ ప్రకాశరావు మాట్లాడుతూ సినిపరిశ్రమ అభివృద్ధికి పూర్తిస్థాయి వనరులు విశాఖ నగర పరిసరాల్లో ఉన్నాయని, ఎపిలో చిత్రపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పాటునందించాలని కోరారు. చిన్న సినిమాలను పోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో చిత్రదర్శకులు డాక్టర్ ప్రదీప్ అల్లు, నిర్మాత ఎల్‌వి.సూర్యం, సహ దర్శకుడు కే.సంతోష్, నటులు డాక్టర్ ఎస్‌వి.సత్యప్రసాద్, నవీన్, సౌండ్ ఇన్‌చార్జి వేది దాము. సిద్దార్థలను శాలువాతో సన్మానించారు సమావేశంలో రంగా సాయి మీడియా ప్రతినిధులు ఎన్.నాగేశ్వరరావు, హేమ, ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావురెడ్డి, ఉషారాణి, ప్రభు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ దుర్గారావుకు ఘననివాళి

**ప్రజాశక్తి- సీతమ్మధార :** జర్నలిస్టు సంఘాల నాయకుడిగా, సీనియర్ పాత్రికేయుడిగా సోడిశెట్టి దుర్గారావు అందించిన సేవలు చిరస్మరణీయమని జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కొనియాడారు. ఆదివారం పోర్టు మైదానం, విశ్వనాధ్ కన్వెన్షన్‌లో జర్నలిస్ట్ యూనియన్లకు అతీతంగా దుర్గారావు రెండో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. దుర్గారావు చిత్రపటానికి డిప్యూటీ మేయర్ శ్రీధర్‌తో పాటు పలువురు పాత్రికేయులు పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పలుపత్రికల్లో పాత్రికేయుడిగా పని చేయడంతోపాటు పలు సంఘాలకు ప్రాతినిధ్యం వహించి, అందరి మనసులో దుర్గారావు చెరగని ముద్ర వేశారన్నారు. దుర్గారావు కుటుంబానికి తమ వంతు సహకారం ఎప్పుడూ అందిస్తామన్నారు. జాతీయ జర్నలిస్టులు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ దుర్గారావుతో ఎంతోమంది మంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, ఆయన మృతి చెంది రెండేళ్లయినా ఇంకా అందరి మనసుల్లో గుర్తున్నారన్నారు. కార్యక్రమం సమన్వయకర్త, జేసాప్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాల్మీకి నాగరాజు మాట్లాడుతూ గతేడాది వేర్వేరుగా సేవా కార్యక్రమాలు నిర్వహించామని, ఈ ఏడాది ఉమ్మడిగా నిర్వహిస్తున్నామన్నారు. వర్షం కారణంగా క్రికెట్ టోర్నీని వాయిదా వేశామన్నారు. జర్నలిస్టులకు లెన్స్ హన్స్ సంస్థ సహకారంతో కంటి వైద్య శిబిరం నిర్వహించి కంటి డ్రాప్స్, మందులు ఉచితంగా అందించగా, కంటిఅద్దాలు 50 శాతం రాయితీతో అందజేశారు. పెన్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి లోకేష్‌కుమార్ మట్టా, కోశాధికారి గుండురాజు, సీనియర్ జర్నలిస్ట్ తిలక్, దుర్గారావు కుమారులు నిఖిల్, లోహిత్ పాల్గొన్నారు.. పెద్ద ఎత్తున జర్నలిస్టులు పాల్గొని సంతాపం తెలిపారు.

## ఎగ్జిట్‌పోల్స్‌తో గందరగోళం!

### -తలలు పట్టుకుంటున్న నేతలు, ప్రజలు

**ప్రజాశక్తి-పద్మనాభం :** ఎపిలో ఏపార్టీ అధికారంలోకి వస్తుందో స్పష్టత లేని విధంగా వెలువడిన ఎగ్జిట్‌పోల్స్‌లో రాజకీయపార్టీల నేతలు, ప్రజలు అయోమయానికి, గందరగోళానికి గురౌతున్నారు. కొన్ని సర్వేలు కూటమికి అనుకూలంగా ఫలితాలనిస్తే, మరికొన్ని వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తుందని స్పష్టం చేయడంతో దేన్ని నమ్మాలో తెలియక ప్రజలు తలలు పట్టుకున్నారు. గతంలో ఏ ఎన్నికల్లోనూ లేని గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. అనుకూల ఫలితాల సర్వేలను చూసి, ఆనందపడుతున్నా, ప్రతికూల సర్వే ఫలితాలపై లోలోప ఆందోళన చెందుతున్నారు. ఫలితాలు తమకు అనుకూలమేనని కొందరు బెట్టింగ్‌కు పిలుస్తుండగా, మరికొందరు వెనకడుగు వేస్తున్నారు. ఇంకొందరైతే, ఎందుకీ గందరగోళం, రెండు రోజులు ఆగితే సరిపోలా అంటూ సర్దుకుపోతున్నారు. ఎగ్జిట్‌పోల్స్‌పై గ్రామాల్లో ఏ ఇద్దరు కలిసినా దీనిపైనే చర్చ, కిరాణాదుకాణాలు, హోటల్స్, ఉపాధి పనిప్రదేశాలు, రచ్చబండల వద్ద ఇలా ఎక్కడచూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చ సాగుతోంది. పత్రికలు, టీవీల్లోని వార్తలు, విశ్లేషణలపైనే సర్వత్రా చర్చ సాగుతోంది.

# టోల్‌ప్లాజా రేట్లు పెంచడం దారుణం



మాట్లాడుతున్న బొండా జగన్

**ప్రజాశక్తి -గాజువాక :** సుప్రీంకోర్టులో కేస్ పెండింగ్‌లో ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా అగనంపూడి టోల్‌గేట్ రేట్లు పెంచడం దారుణమని, 87వ వార్డు టిడిపి కార్పొరేటర్ బొండా జగన్ ఆరోపించారు. ఆదివారం గాజువాక పార్టీ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ, అగనంపూడి టోల్ ప్లాజా తొలగించాలని రెండు దశాబ్ధాలుగా పోరాటం చేస్తుంటే, పల్లా శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో 2018లో తన సొంత డబ్బులతో, గాజువాక బార్ అసోసియేషన్ ద్వారా హైకోర్టులో కేసు వేసి అగనంపూడి టోల్‌ప్లాజాను ఎత్తేయించామన్నారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరించి, ఎత్తేసిన టోల్‌ప్లాజాను మళ్లీ తెచ్చి పునరుద్ధరించారన్నారు.

ఇపుడు సుప్రీంకోర్టులో వివాదం ఉండగానే ఈనెల 2, ఆదివారం నుంచి అగనంపూడి టోల్‌ప్లాజా ఛార్జీలను పాత రేట్లుపై 5 శాతం పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విల్లా రామ్మోహన్ కుమార్ మాట్లాడుతూ, నగర పరిధిలో టోల్‌ప్లాజా ఉండడం నిబంధనలకు విరుద్ధమని తెలిసినా, ఐదేళ్లుగా వైసిపి నేతలు పట్టించు కోలేదన్నారు. నగరం నుంచి దాదాపు 25వేలమంది ఉద్యోగులు, ప్రజల ఈ టోల్‌ప్లాజా మీదుగా రాకపోకలు సాగిస్తూ, అదనపు ఛార్జీల భారాన్ని మోస్తున్నారన్నారు. తక్షణమే టోల్‌ప్లాజాను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. టిఎన్‌టియుసి విశాఖ పార్లమెంటరీ అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టిడిపి నాయకులు బి రాజన్‌రాజు, వాకాడ వాసు అనంతలక్ష్మి, జనసేన పార్టీ నాయకులు బి కామేశ్వరరావు పాల్గొన్నారు..

# విజయోత్సవ ర్యాలీలపై నిషేధం



మాట్లాడుతున్న డిసిపి సత్తిబాబు

**ప్రజాశక్తి -గాజువాక :** ఈనెల 4న ఎన్నికల ఫలితాల అనంతరం ఈ నెల6వ తేదీ వరకు విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు, బాణసంచా కాల్చడం వంటి చర్యలకు అనుమతులు లేవని డిసిపి మేకా సత్తిబాబు అన్నారు. ఆదివారం గాజువాకలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లుగానే, కౌంటింగ్ తర్వాత కూడా రాజకీయ పార్టీల నేతలు, ప్రజలు సంయమనంతో వ్యవహరించి, సహకరించాలని కోరారు. సిఆర్‌పిసి 144 సెక్షన్, పోలీస్‌యాక్ట్ 30 అమలులో ఉన్నందున, నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

సమావేశంలో సిపిఎం నేత ఎం రాంబాబు, వైసిపికార్పొరేటర్ ఇమ్రాన్, టిడిపి నేత బలిరెడ్డి సత్యనారాయణ, సౌత్ ఎసిపి త్రినాధ్, సిఐలు శ్రీనివాసరావు, శ్రీనివాసు, దాలిబాబు పాల్గొన్నారు.

## క్రీడా సామగ్రి పంపిణీ

**ప్రజాశక్తి -ఆనందపురం :** యువత క్రీడల్లో రాణించాలని ఆనందపురం మండల జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి కోరారు. ఆదివారం మండలంలో శొంఠ్యాం గ్రామంలో క్రికెట్, వాలీబాల్ క్రీడాకారులకు క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ క్రీడారంగాన్ని ప్రోత్సహించి క్రీడాకారులకు అవసరమైన పరికరాలను అందజేయడం ఆనందంగా ఉందన్నారు. గతంలో క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశా మన్నారు. ఏటా క్రీడల ప్రోత్సాహానికి తనవంతు సాయం అందిస్తున్నానన్నారు. ఇదే విధానాన్ని ఇకముందు కూడా కొనసాగిస్తానని మూర్తి అన్నారు.

# అక్రమాలకు అడ్డాగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్

### ప్రిన్సిపల్ సమీర్‌కుమార్ అవినీతికి పాల్పడుతున్నారని పేరెంట్స్ కమిటీ ధ్వజం



మాట్లాడుతున్న పేరెంట్స్ అసోయేషన్ కార్యదర్శి

**ప్రజాశక్తి -గాజువాక :** ఉక్కు నగరం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ప్రస్తుత ప్రిన్సిపాల్ సమీర్‌కుమార్ పాండే అవినీతి, అక్రమాలు పెచ్చుమీరిపోయాయని స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్‌వి సత్యనారాయణ, సభ్యురాలు వై జ్యోత్స్న ఆరోపించారు..ఆదివారం గాజువాక ఎస్‌బిటి కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియాతో మాట్లాడుతూ, పుస్తకాల కొనుగోలు, భవన నిర్మాణం, మరమ్మతులు, విద్యార్థుల అడ్మిషన్లు, ఉద్యోగాల భర్తీ ఇలా ఏ ఒక్క అవకాశాన్నీ వదలకుండా పిన్సిపల్ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపులకు పాల్పడుతూ తనకు ఎదురులేదన్నట్టు ప్రవర్తిస్తున్నాడన్నారు. సీట్లు భర్తీలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పిల్లలకు తొలిప్రాధాన్యతనిచ్చి, మిగులు సీట్లు ఇతరులకు ఇవ్వాలన్న నిబంధనను తుంగలో తొక్కి, ఇష్టారాజ్యంగా సీట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఏడుగురు అడ్‌హక్ టీచర్లను, మహిళా టీచర్లను దుర్మార్గంగా తొలగించారన్నారు. నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకుని, ఉద్యోగం పర్మినెంట్ అవుతుందన్న తరుణంలో తెలుగుటీచర్‌ను తొలగించి, వేరొక టీచర్‌కు అడ్‌హక్ పద్ధతిలో నియమించి, అతనిని పర్మినెంట్ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. పోస్టుల భర్తీలో లక్షలాది రుపాయల అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు ఇదే పాఠశాలలో టెన్త్ చదువుతున్న ప్రిన్సిపల్ కుమారుడు, నగరంలో ఫిట్‌జీలో ఒకే కాలంలో ఎలా చదువుతున్నాడో విచారణ జరిపి నిగ్గు తేల్చాలన్నారు. ప్రిన్సిపల్ అక్రమాలపై తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారి పిల్లలను ఫెయిల్ చేయడం, టిసిలు ఇచ్చి పంపించేస్తున్నారన్నారు. పేరెంట్స్ కమిటీ సెక్రటరీగా ప్రశ్నించినందుకు తన కుమార్తెను ఫెయిల్ చేయించాడని ఆరోపించారు. ఇప్పటికైనా ఎల్‌ఎంసీ కమిటీ స్పందించి, దీనిపై చర్యలు చేపట్టాలని, ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## నేరాలు ఘోరాలు

### డివైడర్‌ను ఢీకొన్న బైక్

#### - ఇద్దరికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి - ఆరిలోవ :** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలైన ఘటన సాగరతీరం ర్యాడిసన్ బ్లూ హోటల్ వద్ద ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలివి. జోడుగుళ్ళపాలెం నుంచి రుషికొండ వైపు ఇద్దరు యువకులు బైక్‌పై వెళుతుండగా, హోటల్ ర్యాడిసన్ బ్లూ సమీపంలో ప్రమాదవశాత్తు వారు ప్రయాణిస్తున్న బైక్ డివైడర్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన ఇద్దరు యువకులను స్థానికుల సమాచారం మేరకు ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిషేధిత నిల్వలుంటే కఠినచర్యలు



ఇళ్లల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి-ఆనందపురం :** అక్రమ, నిషేధిత నిల్వలను ఇళ్లల్లో గుర్తిస్తే, వాటి యజమానులపై చర్యలు తప్పవని ఆనందపురం సిఐ. టివి. తిరుపతిరావు హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సిపి ఆదేశాలతో ఆదివారం ఉదయం బొడ్డపాలెం, వెల్లంకి పంచాయతీలలో సిఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టి సోదాలు నిర్వహించారు. మారణాయుధాలు, మత్తు పదార్థాలు, మందు గుండు సామాగ్రిని నిల్వ ఉంచేందుకు ఇళ్లను అద్దెలకు ఇవ్వకూడదని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవ్వరైన ఉంటే సమాచారం ఇవ్వాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ఆధార్ కార్డులను పరిశీలించారు. తనిఖీల్లో ఎస్ఐ గంట్యాడ సంతోష్, ఎఎస్ఐ సత్యనారాయణ, పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గ్రామాల్లో సిఆర్‌పిసి 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలెవరూ గుంపులుగా ఒకే చోట ఉండరాదని పోలీసులు ఆదివారం విస్తృతంగా పలు ప్రాంతాల్లో, గ్రామాల్లో ఆటో ద్వారా మైకు ప్రచారం నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని సూచించారు. మందుగుండు సామగ్రి ఎక్కడైనా ఉన్నట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

**సీతమ్మధార :** ఈనెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్, ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. హింసాత్మక ఘటనలు జరిగే అస్కారముందనే అనుమానాస్పద ప్రాంతాలతో పాటు, రైల్వే న్యూ కాలనీ, శ్రీకన్య థియేటర్ జంక్షన్, చాకలిగెడ్డ, రామకృష్ణనగర్ అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డు, శ్రీనివాస్ నగర్, నందగిరి నగర్ తదితర ప్రాంతాలలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ నెల 6 వరకు ఎన్నికల కోడ్, 144సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు అవాంఛనీయ ఘటనలకు దూరంగా ఉండాలని సిఐ విజయకుమార్ హితవుపలికారు.

## విశ్రాంత టిపిఒకు సత్కారం

**ప్రజాశక్తి-సీతమ్మధార :** జివిఎంసి పట్టణ ప్రణాళిక విభాగంలో విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన జనార్ధనరావు సేవలు వెలకట్టలేనివని ప్రముఖ న్యాయవాది రమేష్ తెలిపారు ఆదివారం టిపిఒగా ఉద్యోగ విరమణ చేసిన జనార్ధనరావును ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగంలో 40ఏళ్లుగా వివిధ జిల్లాల్లో పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. విధినిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా, నీతి నిజాయితీగా పనిచేసి పలువురి మన్ననలు పొందారన్నారు. ఉద్యోగవిరమణ తర్వాత ఆనందం,ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.

## ఈసెట్‌లో చైతన్య ఉత్తమ ప్రతిభ

### - కెమికల్ విభాగంలో తెలంగాణలో 5, ఆంధ్రాలో ఏడో ర్యాంకు



చైతన్యకుమార్

**ప్రజాశక్తి,-ఆనందపురం :** ఇటీవల ఉభయ తెలుగు రాష్ట్రాలలో విడుదలైన ఇసెట్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని శొంఠ్యాం పంచాయతీ గుమ్మివానిపాలెం గ్రామానికి చెందిన గొలజాన చైతన్యకుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్లో 7వ ర్యాంకు, తెలంగాణలో 5వ ర్యాంకు సాధించాడు. చిన్నప్పటి నుంచి చదువులో చైతన్యకుమార్ చురుగ్గా ఉండే చైతన్య, తల్లిదండ్రులు గొలజాన రవి, లక్ష్మీల ప్రోత్సాహంతోకంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్‌లో డిప్లమో పూర్తి చేశారు. ఇపుడు ఇసెట్‌లో ఉత్తమ ర్యాంకులను సాధించాడు. ఈసందర్భంగా చైతన్యకుమార్ మాట్లాడుతూ బిటెక్ పూర్తి చేసి, గేట్ ప్రవేశపరీక్ష రాసి ఉన్నత విద్యను అభ్యసించాలని ఆలోచనతో ఉన్నట్లు తెలిపారు. చైతన్యకుమార్‌ను కళాశాల ప్రిన్సిపల్ కెవి రమణ గ్రామస్తులు అభినందించారు.

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న ఏసిపి సునీల్

**ప్రజాశక్తి -మధురవాడ :** ఎన్నికల కౌంటింగ్ రోజున, ఫలితాల విడుదల తర్వాత ఎటువంటి ఘర్షణలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవనినార్త్ జోన్ ఏసిపి సునీల్ హెచ్చరించారు. ఆదివారం పిఎం పాలెం పోలీస్‌స్టేషన్ 70మంది రౌడీషీటర్లకుకౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్స్ ఎటువంటి అవాంఛనీయ ఘటనల్లో పాలుపంచుకోవద్దని సూచించారు. కౌన్సిలింగ్‌లో సిఐ వై.రామకృష్ణ పాల్గొన్నారు.

## ఎన్నికల కౌంటింగ్‌లో అప్రమత్తత



కౌంటింగ్ ఏజెంట్లతో మాట్లాడుతున్న కెకె.రాజు

**ప్రజాశక్తి-సీతమ్మధార :** ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఆధ్వర్యంలో వైసిపి ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లు శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ కుమార్, జివిఎంసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఎన్నికల పరిశీలకులు రొంగలి జగన్నాథం, పేడాడ రమణి కుమారి, పీలా వెంకటలక్ష్మీ, మాజీ వుడా చైర్మన్ రవిరాజు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కంటిపాము కామేశ్వరి, సారిపిల్లి గోవింద్, రెయ్యి వెంకటరమణ, సాడి పద్మారెడ్డి, వావిలపల్లి ప్రసాద్, ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, సేనాపతి అప్పారావు, సీనియర్ నాయకులు రవిరాజు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు,కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు

## సరిపల్లిలో అమ్మవార్ల పండగ

**ప్రజాశక్తి-పెందుర్తి :** మండలంలోని సరిపల్లి గ్రామంలో మరడిమాంబ, భూలోకమాంబ పండగను ఆదివారం జనసేన నాయకులు ఎంపిటిసి గొల్లపల్లి రమణ, టిడిపి సర్పంచ్ గొర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు అమ్మవార్ల తోలేళ్ల ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరారు. అమ్మవార్లకు పసుపు, కుంకుమ పూజలు, మొక్కుబడులు తీర్చుకున్నారు.

# విజ్ఞాన సర్వస్వం.. పౌర గ్రంథాలయం!



ర్యాకుల్లోని పుస్తకాలను చూస్తున్న విద్యార్థినులు

- విద్యార్థులు, ఉద్యోగార్థులకు చేదోడుగా సేవలు
- అందుబాటులో వేలాది పుస్తకాలు, పఠన పరికరాలు
- కంప్యూటర్లు, స్టడీరూంలతో అదనపు సౌకర్యాలు
- ఎందరి భవిష్యత్‌కూ బాసటగా నిరంతర సేవలు

**ప్రజాశక్తి-సీతమ్మధార :** గ్రంథాలయమంటే జ్ఞానబాండాగారం అనే నానుడికి నిలువెత్తు నిదర్శనం ద్వారకానగర్ లోని విశాఖ పౌర గ్రంథాలయం. నగరం నడిబొడ్డున అందరికీ అందుబాటులో, విశాలమైన స్థలంలో ప్రశాంత వాతావరణంలో, అధునాతన సౌకర్యాలతో కొలువుదీరి ఉంది. విద్యార్థులు, ఉద్యోగార్థులు, విశ్రాంత ఉద్యోగులు, ఇలా అన్నివర్గాల ప్రజలకు అవసరమైన తాజా సమాచారాన్నిచ్చే దినపత్రికలు, మేగజైన్స్‌తోపాటు ఆచూకీ పుస్తకాలు, పఠన పరికరాలతో విజ్ఞానదాయకంగా అలరారుతోంది. ఉచిత వైఫై సేవలు, ఇంటర్నెట్ సదుపాయమున్న కంప్యూటర్లతో స్టడీరూం సేవలు వంటి అదనపు హంగులతో ఉద్యోగార్థులకు వరప్రదాయినిగా నిలుస్తోంది.

విశాఖ నగరంలోని పౌరగ్రంథలయాన్ని నిత్యం వెయ్యిమంది వరకు పాఠకులు సందర్శించి, సేవలు పొందుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన పూర్తి సమాచారంతో పుస్తకాలు, పఠనపరికరాలు అందుబాటులో ఉండడంతోపాటు, చదువుకునేందుకు అనువైన ప్రశాంత వాతావరణం ఉండడంతో అధిక సంఖ్యలో ఈ గ్రంథాలయ సేవలను వినియోగించుకుంటున్నారు. గ్రంథాలయంలో 15వరకు దినపత్రికలు, 30వరకు మేగజైన్స్ అందుబాటులో ఉండడంతోపాటు వీటిని చదివేందుకు వచ్చిన పాఠకులకు మంచి వెలుతురున్న కుర్చీలు, బల్లలు వేయడంతో వీటిని వినియోగించుకుంటున్నారు. ఇక పోటీ పరీక్షలకు, ప్రభుత్వ కొలువులకు సన్నద్ధమౌతున్న విద్యార్థులతో గ్రంథాలయం కళకళలాడుతోంది. ఎటువైపు చూసినా చేతిలో బల్ల, పుస్తకాలతో వీరు వచ్చి గ్రంథాలయంలో అందుబాటులో ఉండ వేలాది గ్రంథాలను వినియోగించుకుంటున్నారు. జనరల్ సెక్షన్‌లో తెలుగు సాహిత్యం, కవితలు, నాటకాలు, కథల వ్యస్తకాలం, ఆరోగ్యం, ఆయుర్వేదం సంగీతం, కార్టూన్స్, నవలలు, యోగా మెడిటేషన్, వేదాలు, రామాయణం భారతం భాగవతం వంటి భక్తి పుస్తకాలు పుస్తకాలు తెలుగులోనే 35 వేల వకు అందుబాటులో ఉన్నాయి. సాహితీవేత్తల జీవిత చరిత్రలు, కాంపిటేటివ్ మ్యాగజైన్స్, సినిమా పుస్తకాలు, సినీ కళాకారుల జీవిత చరిత్రలు, స్వాతంత్ర సమరయోధులు రాజకీయ నాయకుల జీవిత చరిత్ర వంటి పుస్తకాలను విద్యార్థులు చక్కగా వినియోగించు కుంటున్నారు పోటీ పరీక్షల్లో సిద్ధమైన విద్యార్థులకు క్విజ్ కాంపిటేషన్, లేటెస్ట్ సమాచారంతో కూడిన పుస్తకాలు ఉన్నాయి. చిన్నపిల్లలకు సంబంధించి దాదాపు 2,500 ఆకర్షనీయమైన పుస్తకాలతో గ్రంథాలయంలో దాదాపు 67 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు అంటున్నారు. దీంతోపాటు గ్రంథాలయంల ఆవరణ లోనూ, వెనుక గదిలోనూ పోటీపరీక్షలు, ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయి. పైగదిలో కంప్యూటర్లుతో కూడిన రీడింగ్ రూంలలో ఇంటర్నెట్ సాయంతో ప్రపంచ విజ్ఞానాన్ని గుప్పిట్లోకి తెచ్చుకోవడం ద్వారా విజయతీరాలకు చేరాలన్న పట్టుదలతో కృషిచేసే విద్యావంతులు కనిపిస్తారు. అంతేకాక గ్రంథాలయంతో నిత్యం ఏదోఒక సాంస్కృతిక, విజ్ఞానదాయకమైన కార్యక్రమాల నిర్వహణకు హాల్స్ ఉన్నాయి. అన్నివర్గాల ప్రజలకు అవసరమైన అన్ని రకాల విజ్ఞాన సేవలను అందించే అధునాతన, సాంకేతిక విజ్ఞాన సర్వస్వం విశాఖ పౌర గ్రంథాలయమంటే అతిశయోక్తి కాదని దీన్ని సందర్శించే వారంతా చెబుతుండడం విశేషం.

### సేవలను మరింత విస్తృతం చేస్తాం

విద్యార్థులు, ఉద్యోగార్థులతో అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన విజ్ఞాన, సమాచార సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రశాంత వాతావరణంలో పాఠకులు పుస్తకాలు చదువుకునేందుకు వీలుంది. పోటీ పరీక్షల సన్నద్ధతకు వచ్చేవారంతా విజయం సాధించే పరిస్థితులు కల్పించేలా గ్రంథాలయ సేవలను రానున్న రోజుల్లో మరింత విస్తృతం చేసి, ఉత్తమ లైబ్రరీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం.

డివిఎస్ వర్మ, గ్రంథాలయ కార్యదర్శి



రీడింగ్ రూంలో పుస్తక పఠనంలో పాఠకులు



స్టడీరూంలో ఉద్యోగ పరీక్షలకు సన్నద్ధమౌతున్న విద్యావంతులు

### సందేహాలుంటే స్నేహితులతో చర్చలు



ఎపిపిఎస్‌సి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు ఆరు నెలలుగా మధురవాడ నుంచి వస్తున్నా. పోటీపరీక్ష సమాచారంతో కూడిన పుస్తకాలు అందుబాటులో ఉండడంతో పాటు సందేహాలుంటే చర్చించి, నివృత్తి చేసేందుకు స్నేహితులు ఉన్నారు.

వందన, ఉద్యోగార్థి

### చదువుకునేందుకు చక్కని సౌకర్యాలు



పౌర గ్రంథాలయంలో చదువుకునేందుకు చక్కని సౌకర్యాలు ఉన్నాయి. మూడునెలల నుంచి యుపిఎస్‌సి పరీక్షలకు సన్నద్ధమౌతున్న నాకు అవసరమైన మెటిరీయల్ లభించడం సంతోషంగా ఉంది.

చాందిని, ఉద్యోగార్థి

### పోటీ పరీక్షల సన్నద్ధతకు మంచి వేదిక



పోటీ పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారికి పౌరగ్రంథాలయం మంచి వేదిక. కావాల్సిన సమాచారంతో పుస్తకాలు అందుబాటులో ఉండడంతోపాటు ఇక్కడే చదువుకునేందుకు అనువుగాఉంది. ఏడాదిగా గ్రూప్2 పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా.

సురేష్, విజయనగరం జిల్లా

### అదనపు సేవలు ఉన్నాయి...



పౌరగ్రంథాలయంలో పేపర్స్, మ్యాగజైన్స్‌తోపాటు పోటీపరీక్షల పుస్తకాలు ఉన్నాయి. ఎనిమిది నెలలుగా కంచరపాలెం నుంచి వస్తున్నా. గ్రంథాలయ సేవలతోపాటు క్విజ్, ఇతరత్రా పోటీలు తరచూ జరుగుతుంటాం

మహేశ్వరరావు కంచరపాలెం

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం




జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభిస్తున్న జిఎం వీరేశం

**ప్రజాశక్తి-ఉక్కునగరం:** అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావమని ఉక్కు జనరల్ మేనేజర్ ఎన్. వీరేశం అన్నారు . ఆదివారం ఉక్కునగరం సీ భవన్‌లో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి . జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించినఉక్కు జనరల్ మేనేజర్ ఎన్. వీరేశం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో తెలంగాణ ప్రాంత ఉద్యోగులు విధులు నిర్వహిస్తూనే రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతున్నారన్నారు.. తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు ఎన్. కుమార స్వామి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు తెలంగాణ గేయాలను ఆలపించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, అధికారులు వేణుగోపాల్ ,బి. బాలాజీ, చంద్రమౌళి, సీ జాయింట్ సెక్రటరీ ఆర్.నరసింహ, జి. మల్లేశం, అసోసియేషన్ ప్రతినిధులు జె. శ్రవణ్‌కుమార్, ఎస్.బలరాం, ఎన్. నర్సింగరావు , సిహెచ్ రవి కుమార్ పాల్గొన్నారు.

## ఈశ్వరరావు ఉద్యోగ విరమణ

### -పలువురి అభినందన, సత్కారం

**ప్రజాశక్తి -తగరపువలస:** ఎస్‌బిఐ సీనియర్ హెడ్ ఆర్మర్ గార్డుగా విధులు నిర్వహించిన జివిఎంసి ఒకటో వార్డు శ్రీనగర్‌కు చెందిన పందిరి ఈశ్వరరావు ఉద్యోగ విరమణ పొందారు.విజయనగరం ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయం బ్రాంచిలో హెడ్ ఆర్మర్ గార్డుగా విధులు నిర్వహించి, రిటైరైన ఆయనను బ్రాంచి రీజనల్ మేనేజర్ ఎం సురేష్ బాబు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. అంతకు ముందు అరుకు వేలీ, భీమిలి, ఆనందపురం మండలంలోని వెల్లంకి, సొంఠ్యాం ఎస్‌బిఐ బ్రాంచిల్లో హెడ్ ఆర్మర్ గార్డుగా పనిచేశారు. 1982 మే 1న ఆర్మీలో గన్నర్‌గా జాయిన్ అయిన తాను, అదే ఉద్యోగం చేస్తూ 1999లో రిటైర్ అయ్యానని, అనంతరం 2003 జనవరి 10న ఎస్‌బిఐలో హెడ్ ఆర్మర్ గార్డుగా జాయిన్ అయ్యానని తెలిపారు. అటు ఆర్మీలోనూ, అనంతరం ఎస్‌బిఐలోనూ ఉద్యోగ ప్రస్థానం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.

# విధి నిర్వహణలో నిబద్ధత, సమయస్ఫూర్తి ఉండాలి

## జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వ అధికారి విజయవంతంగా విధి నిర్వహణ సాగించాలంటే వృత్తి పట్ల నిబద్ధత, సమయస్ఫూర్తి కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.హేమంత్, డిపిఆర్‌ఓ డి.సాయిబాబాల ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవి మాట్లాడుతూ డాక్టర్ హేమంత్ శాఖాపరమైన కార్యక్రమాలే కాకుండా అనేక విషయాలలో తనకు సలహాలు సూచనలు ఇచ్చేవారని, ఆయన అనుభవాలను తెలుసుకొని ఎన్నో విషయాలు నేర్చుకున్నానని చెప్పారు. డిపిఆర్‌ఓ సాయిబాబా విలేకరులతో సత్సంబంధాలు నెరపుతూ యంత్రాంగానికి ఎంతగానో తోడ్పడ్డారని చెప్పారు. వీరిలా జిల్లా కలెక్టర్‌కు సలహాలు, సహాయ సహకారాలు అధికారుల నుండి ఉన్నట్లయితే జిల్లా కలెక్టర్ సునాయాసంగా విజయ వంతమవుతారని చెప్పారు. డిఎస్‌ఓ జి రామారావు, డ్వామా పిడి ఈ.సందీప్, జెడ్పి సీఈఓ పోలి నాయుడు, ఏపీఎంఐపి అధికారి జీవీ.లక్ష్మి, బీసీడబ్ల్యూఓ రాజేశ్వరి, ఏటిడబ్ల్యూఓ నాగ శిరీష మాట్లాడారు. అనంతరం సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ తమ అనుభవాలను తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి బి దయానిధి, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన డిపిఆర్‌ఓ, డిఎంహెచ్‌ఓలను సన్మానించిన కలెక్టర్, అధికారులు



బాబికి కేక్ తినిపిస్తున్న మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ

## ఘనంగా బాబీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి మండలం తుమ్మపాల మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, అన్నపూర్ణ బ్యాంకు మాజీ చైర్మన్ కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి) 56వ జన్మదిన వేడుకలు తుమ్మపాల వేణుగోపాలస్వామి ఆలయ కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ నిబద్ధత గల నేతగా బాబి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. అనంతరం పలువురు నేతలు బాబి నాయకత్వ లక్షణాలను, నిబద్ధతను కొనియాడారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బాబీకి తినిపించారు. టీడీపి రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, బొడ్డపాటి రామ్ కుమార్, రాపేటి రామ్‌కుమార్, న్యాయవాది పిళ్లా హర శ్రీనివాసరావు, గొలగాం ఎంపీటీసీ చంద్రశేఖర్, ఆడారి గోవిందరావు, పల్లెల గణేష్, చదరం విశ్వేశ్వరరావు, ఆకుల శ్రీనివాసరావు, సందిన శ్రీనివాసరావు, బుదిరెడ్డి సూరిబాబు, నడిపల్లి బూసి బాబు, సందిన సునీల్, బొడ్డపాటి రాజారావు, బాబి అభిమానులు దుస్సాలువలు, పూల బొకేలు, దండలతో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై మాక్ డ్రిల్

ప్రజాశక్తి- అనకాపల్లి

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈనెల 4న నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై శాసనసభ నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై మాక్ డ్రిల్ నిర్వహించడంతో పాటు పలు సందేహాలకు సమాధానాలను తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సిబ్బందికి సంబంధించి కౌంటింగ్ శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నిర్వహణ తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి సూచనలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

# పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -అనకాపల్లి

పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకత, కళలను వెలికి తీసి తగిన తర్ఫీదు ఇస్తే జీవితంలో అభివృద్ధి సాధిస్తారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక ఉడ్పేట కళ్యాణి నృత్య సంగీత అకాడమీలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ప్రముఖ సంగీత దర్శకుడు ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దాడి రత్నాకర్ మాట్లాడారు. కొన్నేళ్లుగా కళ్యాణి నృత్య సంగీత అకాడమీ వ్యవస్థాపకులు ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్ విద్యార్థుల్లో ఉన్న కళలను వెలికి తీసేందుకు వేసవిలో ఇలా శిక్షణ ఇవ్వడం హర్షణీయమన్నారు. ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది నేడు రాష్ట్రస్థాయిలో సంగీతంలో ప్రావీణ్యత సంపాదించారని తెలిపారు. ఇంద్రగంటి లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ సంస్థ అభివృద్ధికి మాజీ మంత్రి దాడి వీరభద్రరావుతో పాటు వారి కుమారులు రత్నాకర్, ప్రభాకర్ ఎంతో సహకారాన్ని అందించారని తెలిపారు. తమ సంస్థ ద్వారా సంగీతం, నృత్యంలో ఇచ్చిన తర్ఫీదుతో ఎంతోమంది నేడు ఉన్నత స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేశవస్వామి ఆలయంలో ధర్మశ్రీ పూజలు

ప్రజాశక్తి-చోడవరం

చోడవరంలోని శ్రీకేశవ స్వామి ఆలయంలో ఏకాదశి పురస్కరించుకొని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తులసి పూజ కార్యక్రమం నిర్వహించారు. సతీ సమేతంగా కుటుంబ సభ్యులతో కలిసి ఈ పూజ నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలవాలని చోడవరంలో మరోసారి వైసిపి గెలవాలని ఈ సందర్భంగా కోరుకుంటూ తులసి పూజలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ ఉప్పల బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఒళ్లంతా మెరిసే బంగారం.. ఒలిచి చూస్తే బయటపడే బండారం

# విషతుల్యమవుతున్న మామిడిపండ్లు

## మగ్గడానికి రసాయనాలు వాడుతున్న వైనం

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రకృతి సహజంగా ఆయా సీజన్లలో పండే పండ్లు మానవ ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయి. వేసవి వచ్చిందంటే చాలు మామిడిపండ్లు కోసం కళ్లు కాయలు కాచేలే ఎదురు చూసేవారు ఎంతో మంది ఉంటారు. ఏటా మే మాసంలో మామిడి పండు రుచి చూడనివారు అరుదనే చెప్పాలి. అలాంటి మధురఫలాన్ని లాభాపేక్షతో విషతుల్యం చేస్తున్నారు. పక్వానికి రాకుముందే కాయల్ని కోసి మగ్గడానికి విచ్చలి విడిగా రసాయనాలు వాడేసి రంగుల వలలో వినియోగదారుడ్ని మోసం చేస్తున్నారు. ఈ ఊబిలో వినియోగదారుడు ఇరుక్కుపోయి, రంగు చూసి మోసపోయి లేని జబ్బుల్ని కొని తెచ్చుకుంటున్నాడు. ఈ తతంగం అంతా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. వట్టిగ్గా వినియోగదారుడు మోసపోతున్నా పట్టించుకొనే నాధులు లేరు.

### రసాయనాల పండ్లుతో ఇబ్బంది పడ్డాం

నిగ నిగ లాడుతున్నాయని మార్కెట్లో డజను పళ్ల కొన్నాను. రాత్రికి ఇంట్లో అంతా తిన్నాం. తింటున్నప్పుడే గొంతులో మంట పుట్టింది. ఆ తర్వాత వికారం, వాంతులు అయ్యాయి. పళ్లు మగ్గడానికి విషపూరిత రసాయనాలు వాడడమే కారణమని డాక్టరు చెప్పారు. రెండ్రోజులు అనారోగ్యంతో ఇంటిల్లి పాదిమి ఇబ్బంది పడ్డాం.



- వై.అప్పారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, యలమంచిలి



యలమంచిలి బస్టాండ్ సమీపంలో విక్రయిస్తున్న మామిడిపండ్లు

యలమంచిలి బస్టాండ్ సమీపంలోని పళ్ల దుకాణాలకు వందలకొద్దీ మామిడి పండ్లు బుట్టలు వివిధ రకాలుగా దిగుమతవుతుంటాయి. కొన్ని లారీల్లో వస్తుండగా, మరికొన్ని వ్యాన్లుల్లో వస్తుంటాయి. పరిసర గ్రామాల్లోని రైతుల నుండి తోటలు కొనుక్కొని వ్యాపారులు ఈ మామిడి పండ్లను ఇక్కడికి తెస్తారు. రిటైల్‌గా అమ్ముకొనే వ్యాపారులు వారి దగ్గర బేరమాటి గంప గుత్తగా కొనుక్కొని రోజంతా అమ్ముకుంటారు. ఈ మామిడి పండ్ల వ్యాపారం ఏప్రిల్, మే, జూన్ వరకూ కొనసాగుతుంది. మార్కెట్లోకొచ్చే మంచి రంగులతో వచ్చే పళ్లన్నీ చూడ్డానికి దగ దగ మెరిసిపోతాయి కానీ, తింటే నోరంతా చప్పబడిపోతుంది. ఆశగా బజార్లో కొని ఇంటికి తీసికెళ్లే ఆ ఉత్సాహం ఆ రాత్రికే ఆవిరైపోతుంది. పళ్లను కాల్షియం కార్బైడ్, ఆర్సెనిక్, ఫాస్పరస్ హైడ్రైడ్ రసాయనాలతో మగ్గ పెట్టడం వలన మానవ శరీరంలోని హార్మోన్ల పనితీరు దెబ్బతింటుందన్నారు డాక్టర్లు. కృత్రిమంగా మగ్గబెట్టిన మామిడి పళ్లను కనిపెట్టాలంటే వాటిని నీళ్లలో వేసి చూడాలి. సహజంగా మగ్గినవైతే నీళ్లలో మునుగుతాయి. రసాయనాలతో మగ్గినవైతే నీటిమీద తేలిపోతాయి. వినియోగదారులు దీన్ని గమనించాలి. ప్రభుత్వం కూడా రసాయనాల పళ్లవ్యాపారం అరికట్టే దిశలో విధానాలు రూపొందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

## జాతీయ చిత్రలేఖనం పోటీల్లో సూర్యనారాయణకు బహుమతి


ప్రజాశక్తి-చోడవరం

కేరళ రాష్ట్రం వయనాడు టూరిజం ప్రమోషన్ కౌన్సిల్, కేరళ రాష్ట్ర పర్యాటక శాఖల ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో చోడవరానికి చెందిన చిత్రకారుడు బి సూర్యనారాయణ గీసిన గిరిజన స్త్రీ చిత్రానికి ప్రత్యేక ప్రశంస దక్కింది. కేరళలో జరిగిన ఈ కార్యక్రమంలో కేరళ పర్యాటక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రభాత్, వయనాడు డిస్ట్రిక్ట్ టూరిజం ప్రమోషన్ కౌన్సిల్ కార్యదర్శి అజీజ్, కేరళ పర్యాటక శాఖ అధికారులు సూర్యనారాయణ వేసిన చిత్రపటానికి ప్రత్యేక ప్రశంస, బహుమతులు అందజేశారు. జాతీయస్థాయిలో 30 మంది చిత్రకారులు పాల్గొన్న ఈ చిత్రలేఖన పోటీల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని సూర్యనారాయణ తెలిపారు. చోడవరంలోనూ ప్రతి ఏడాది జాతీయస్థాయి చిత్రలేఖన పోటీలు తను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సూర్యనారాయణను పట్టణానికి చెందిన ప్రముఖులు అభినందించారు.



సూర్యనారాయణ గీసిన బొమ్మను ప్రదర్శిస్తున్న దృశ్యం

# ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి


ఆర్థిక సాయం అందజేస్తున్న నాగేశ్వరరావు

## వంశీకి రూ.10 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

తల్లిదండ్రుల మృతి చెందడంతో నిరాశ్రయుడిగా వున్న మండలంలోని తురకలపూడి గ్రామానికి చెందిన పలివెల వంశీకి రాజాం గ్రామానికి చెందిన సామజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరరావు ఆదివారం రూ.10వేలు ఆర్థిక సహాయం అందచేశారు. వంశీ గతంలో బాణసంచా కాల్చుతుండగా జరిగిన ప్రమాదంలో గాయపడడంతో ఆయన కుడిచేయిని మణికట్టు వరకు వైద్యులు తొలగించడం జరిగింది. వంశీకి సదరం సర్టిఫికెట్ మంజూరుకు కృషి చేసి అందచేశారు. రైలు పాస్, బస్ పాసుతో పాటు రూ.10వేలు నగదును అందచేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా భవన నిర్మాణం కార్మిక సంఘం నాయకులు కొయ్య శ్రీను, రాజాం విఆర్‌పి ఎల్.శ్రీనివాస్, రాజాం యూత్ అసోసియేషన్ సభ్యులు ఆకుల శేషు, మరిసా వీరబాబు, మరిసా అప్పలనాయుడు, పాల్గొన్నారు. సహాయం అందచేసిన ఆకుల నాగేశ్వరరావుకు పలువురు అభినందనలు తెలిపారు.

## నాగుపాము హల్ చల్

ప్రజాశక్తి-దేవరాపల్లి


పట్టుబడిన నాగుపాము

మండలంలోని నాగయ్యపేట గ్రామంలో ఆదివారం సాయంత్రం నాగుపాము హల్ చల్ చేసింది. గ్రామానికి చెందిన నౌడు నారాయణమూర్తి ఇంటిలో ఆదివారం సాయంత్రం నాగుపాము చొరబడింది. భోజనాలు చేయడానికి సిద్ధంగా ఉన్న సమయంలో ఆ పాము కంట పడింది. దీంతో నారాయణమూర్తి కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. గ్రామ సమీపంలో కొప్పలవానిపాలెంకు చెందిన స్నేక్ క్యాచర్ వి.కృష్ణకు సమాచారం ఇచ్చాడు. ఆయన వచ్చి చాక చక్యంగా దానిని పట్టుకొని అడవిలో విడిచి పెట్టాడు. దీంతో వీధిలో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎండల తీవ్రగా కారణంగా నాగుపాము ఇంట్లోకి వచ్చి ఉంటుందని స్థానికులు అంటున్నారు. ఈ వీధిలో 15 రోజుల నుంచి వీధి లైట్లు పని చెయ్యక పోవడంతో నాగు పామును పట్టుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షాలు తొలగింపు

ప్రజాశక్తి-పరవాడ

ఇటీవలి కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వెన్నెలపాలెం- ఎన్‌టిపిసి రహదారిపై మూడు భారీ వృక్షాలు నేలకొరిగి రోడ్డుకు అడ్డంగా పడి ఉన్నాయి. వీటి వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో ఈ విషయమై స్థానికులు వెన్నలపాలెం పంచాయతీ ఉపసర్పంచి, మండల జెసిఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీందో ఆయన వెంటనే స్పందించి ఆదివారం రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగింపుజేసి రోడ్డును క్లియర్ చేయించారు. దీనిపై గ్రామస్తులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.


రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షాలను తొలగిస్తున్న దృశ్యం

### జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో బందోబస్తు, కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి ఆదివారం ఆయన దిశా నిర్దేశం చేశారు. విధుల్లో ఉన్న పోలీస్ ఆఫీసర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి వారికి నిర్దేశించిన డ్యూటీని సమర్థవంతంగా చేయాలని ఆదేశించారు. ప్రతి పాయింట్‌ని పర్యవేక్షించి, ఎన్నికల అభ్యర్థులను, కౌంటింగ్ ఏజెంట్లను, కౌంటింగ్ ఎంప్లాయిస్‌ను ఏ రూట్‌లలో కౌంటింగ్ కేంద్రానికి పంపించాలి, ఎక్కడ వారికి సంబంధించిన వాహనాలను పార్కు చేసుకోవాలి, ట్రాఫిక్‌ను ఏ విధంగా రెగ్యులేట్ చేసుకోవాలి మొదలగు విధుల గురించి తెలియజేశారు. ప్రజలు గుమికూడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పాయింట్ బ్రీఫింగ్ ఇవ్వడం జరిగింది. బందోబస్తు విధుల్లో ఉన్న జిల్లా పోలీసులతో పాటు కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు, ఏపిఎస్‌పి బలగాలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన క్విక్ రెస్పాన్స్ టీమ్ (క్యూ.ఆర్.టి)లు సిద్ధంగా ఉంటాయని, ఎలాంటి ఘటన గురించి సమాచారం వచ్చిన వెంటనే క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారని ఎస్పీ తెలిపారు. సమావేశం అనంతరం కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే రహదారిపై అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లను అనుమతించే దారులను, ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, సత్యనారాయణ, అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజు, పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, నర్సీపట్నం డీఎస్పీ జిఆర్ఆర్.మోహన్, ఎస్‌బి డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇనస్పెక్టర్‌లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, సతీష్, ఎస్సైలు రామారావు, శ్రీనివాస్, రఘువర్మ, జిల్లాలోని ఇతర సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన యోగా శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-చోడవరం



శిక్షణ పొందిన బాల బాలికలు

చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యాన ఉషోదయ విద్యాసంస్థల ఆవరణలో మే 1 నుండి నిర్వహించిన వేసవి యోగా శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు పతంజలి యోగ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేసినట్టు యోగా గురువు పుల్లేటి సతీష్ తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన యోగా, ప్రకృతి వైద్యులు గుడివాడ బామ్మిలను సత్కరించారు. కార్యక్రమంలో పతంజలి యోగా శిక్షణ కేంద్రం చైర్మన్ పసుమర్తి అశోక్, అడ్వకేట్ శ్రీనివాసరావు, డాక్టర్ బంగారు కృష్ణ, ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, యోగ టీచర్స్ కొట్టాపు హరి కిరణ్, భోగవిల్లి గణేష్, సంతోష్, రవితేజ యోగ కేంద్ర సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలో రెండు రోజులుగా విద్యుత్ కోతలు విధించడంతో ప్రజలు ఇక్కట్లు, ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో జనం భయభ్రాంతులకు గురయ్యారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలో పిడుగులు పడడంతో విద్యుత్ కోత విధించారు. శనివారం రాత్రి కూడా విద్యుత్తు కోత ఉండడంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోహిణి కార్తె ఉక్కపోత కారణంగా జనం నానా ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ కోతలు నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి విద్యుత్ కోతలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ, గుమ్మిరేవులు, దుప్పిలివాడ గ్రామ పంచాయతీల పరిధిలోని గిరిజనులు ఆదివారం మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. మావోయిస్టులు కారణంగానే గిరిజన ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని, గిరిజనులను ఇన్ ఫార్మర్ల నెపంతో హత్యలు చేస్తున్నారని వారు ఆరోపించారు. గిరిజన గ్రామాల అభివృద్ధి చేయడానికి ముందుకు వచ్చే వారిని బెదిరించి వారి దగ్గర మావోయిస్టు డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. మావోయిస్టుల కార్యకలాపాలు తగ్గుముఖం పట్టడంతో గత నాలుగేళ్ల నుంచి గిరిజన గ్రామాలకు రోడ్లు, హాస్పిటల్, విద్య, సెల్ టవర్లు వంటి సదుపాయం కల్పించడంలో పోలీసులు పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు. తమ ప్రాంతాలకు మావోయిస్టులు రాకూడదని, ఒకవేళ వచ్చిన గిరిజన నుంచి ఎటువంటి మద్దతు ఉండదని స్పష్టం చేశారు.

## 14 నుంచి పాలిటెక్నిక్ తరగతుల ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

పాలిటెక్నిక్ ప్రథమ సంవత్సర తరగతులు ఈనెల 14 నుంచి ప్రారంభించడం జరుగుతుందని అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఐవిఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు ఆప్షన్లను ఎంచుకోవచ్చని, ఈనెల 11న ఆప్షన్లు మార్చుకునే అవకాశం, ఈనెల 13న సీట్ల అలాట్మెంట్, 14 నుంచి 19వ తేదీ వరకు కళాశాలలో జాయిన్ అవ్వడం, రిపోర్టు చేయాలని సూచించారు. కాగా ఏడవ రోజు ఆదివారం కౌన్సిలింగ్ 92 వేల ఒకటవ ర్యాంకు నుంచి లక్షా 8వేల ర్యాంకు వరకు కౌన్సిలింగ్ నిర్వహించగా 91 మంది హాజరుకాగా వారి ధ్రువ పత్రాలను పరిశీలించి ఐసిఆర్ పత్రాలను అందజేశారు.

## అనకాపల్లి- చోడవరం ప్రధాన రహదారిపై గోతులు

### ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
### పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-అనకాపల్లి


చిన్నబాబు కాలనీ వద్ద గొయ్యిలో నిలిచిపోయిన వ్యాన్

అనకాపల్లి-చోడవరం రోడ్లో పలు చోట్ల గోతులు ఏర్పడ్డాయి. ప్రధానంగా చిన్నబాబు కాలనీ వద్ద ముడుకులోతు గొయ్యి పడడంతో ప్రయాణికుల, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కోట్ల రూపాయలతో ఏడాది క్రితం వేసిన ఈ రహదారి అప్పుడే గోతులు పడడంతో నాణ్యతపై పలువురు విమర్శలు చేస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం ఉప ముఖ్యమంత్రి, మంత్రి, ప్రభుత్వ విప్పు వంటి రాజకీయ నాయకులు రాకపోకలు సాగించినా మెయిన్ రోడ్‌లో పడిన ఈ గోతిని పట్టించుకోకపోవడం శోచనీయం అని స్థానికులు విమర్శిస్తున్నారు. ఎన్నికల్లో కోట్లకు కోట్లు ఖర్చుపెట్టిన ప్రజా నాయకులు కనీసం రోడ్డుపై ఉన్న గుంతలను మరమ్మతులు చేయకపోవడం పట్ల స్థానికులు, ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఈ గోతిలో ద్విచక్ర వాహనదారులు పలుమార్లు పడి ప్రమాదాలకు గురయ్యారు. పెద్ద వాహనాలు సైతం తప్పించుకునే స్థలం లేక గోతిలో పడి మరమ్మతులకు గురవు తున్నాయి. పలుమార్లు వాహనాలు గొయ్యిలో నిలిచిపోవడంతో తప్పించుకునే స్థలం కూడా లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్ అండ్ బి అధికారుల పరిస్థితి సరే సరి.., ఈ అధికారులు ఎక్కడ ఉంటారో, ఎక్కడ పనులు చేస్తారో ఎవరికి తెలియదు. కార్యాలయానికి వెళితే అక్కడ సిబ్బంది జాడ కానరాదు. ఈ నేపథ్యంలో రోడ్డు సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును అనుకొనే మండల వైస్ ప్రెసిడెంట్, గ్రామ సర్పంచు నివాసం ఉంటున్నా కనీసం పట్టించుకోలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి కనీసం రోడ్డు మరమ్మతులు తక్షణం చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

# చల్లబడ్డ వాతావరణం

## - వర్షంతో ఉపశమనం- సేదతీరిన జనం

ప్రజాశక్తి -నక్కపల్లి:వర్షంతో వాతావరణ చల్లబడటంతో భానుడి ప్రతాపానికి ఉక్కిరిబిక్కిరైన జనం ఉపశమనం పొందారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో శని,ఆదివారం కురిసిన తేలికపాటి జల్లులకు వాతావరణమంతా ఒక్కసారిగా చల్లబడింది. ఎండ వేడిమికి తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి వర్షం హాయినిచ్చింది. ఇటీవల భానుడు నిప్పులు గక్కడంతో ఎటు చూసినా అగ్ని జ్వాలలుగా కనిపించే ప్రదేశాలు ఇప్పుడు కూల్ కూల్ గా కనిపిస్తున్నాయి. నింగిలో మబ్బులు కమ్ముకుని చిరుజల్లులు పడటంతో ప్రకృతి ప్రదేశాలు మంచుతో అలుముకున్నట్లుగా సుందరంగా దర్శనమిస్తున్నాయి. గత వారం రోజులుగా వడ గాలులు, ఉక్కపోతతో జనం అల్లాడిని విషయం తెలిసిందే. దీనికి తోడు అప్రకటిత విద్యుత్ కోతలు తోడవడంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎండ వేడిమికి తట్టుకోలేక ప్రయాణికులు ప్రయాణాలు సాగించేందుకు హడలి పోయారు. ఇక కూలీల బాధలు వర్ణనాతీతం. మండే ఎండలో పనిచేస్తూ నానా ఇబ్బందులు పడేవారు. ఇటువంటి సమయంలో వర్షంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.



మేఘావృతమైన ఆకాశం



ఉపమాక గరుడాద్రి పర్వతం వద్ద చేరిన నీరు

# ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

## -గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు రకాల పోటీలు



గొలుగొండలో అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఈ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులతో నీతి కథలు చదివించి, నీతిని బోధించారు. గ్రంథాలయాధికారి గోవిందేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవడం అలవర్చు కోవాలన్నారు. పుస్తకాలు చదవడంతో జ్ఞానం పెంపొందు తుందన్నారు.

**గొలుగొండ:**స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ఆదివారం కొనసాగించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. లెమన్ అండ్ స్పూన్ గేమ్ ఆడించారు. గ్రంథాలయాధికారి రాజుబాబు మాట్లాడుతూ, ఈ నెల 7న వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 22 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

**రోలుగుంట:**స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వరలక్ష్మీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం నీతికథలు చెప్పారు. ఆమె మాట్లాడుతూ 7న శిక్షణ శిబిరాలు ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

**పాయకరావుపేట:**స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి చిన్నారుల నుండి విశేష స్పందన లభిస్తుంది. విద్యార్థులకు పద్యపఠనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు హాజరయ్యారు. అనంతరం ప్రోత్సాహక బహుమతులు ఆచార్యులు చేతులమీదుగా అందజేశారు.ఈ సంధర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు మాట్లాడుతూ, నైతిక విలువలను పెంపొందించుకోవడానికి పద్యపఠనం దోహదపడుతుందన్నారు.



మల్కాపురంలో...

**భీమునిపట్నం :** వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఖో ఖో, పరుగు పందెం వంటి ఆటల పోటీలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శాఖా గ్రంథాలయ అధికారి మహేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం దత్తి. ఈశ్వరరావు, విశ్రాంత ఉద్యోగి బి కృష్ణ పాల్గొన్నారు.

**దేవరాపల్లి**

దేవరాపల్లి శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. ఆదివారం నాటి కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా సీనియర్ జర్నలిస్ట్ కాటపల్లి అప్పారావు వ్యవహరించారు. బొమ్మల చెప్పిన కమ్మని కథలు పుస్తకంలోని కథలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాఖ గ్రంథాలయం అధికారి ఓ.శ్రీనివాసరావు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**ములగాడ**: సమాజంలో ఉన్న దురాచారాలను పోగొట్టడానికి పాటలు, సాంస్కృతిక అంశాలు దోహదపడతాయని ప్రముఖ రచయిత కె.సత్తిరాజు అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో మాట్లాడుతూ, పాటల ద్వారా సమాజాన్ని జాగృతం చేయొచ్చన్నారుఈ సందర్భంగా విద్యార్థులకు పాటల పోటీని నిర్వహించారు. పాటల పోటీకి న్యాయ నిర్ణేతలుగా జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, రచయిత కె.సత్తిరాజు, సిద్ధార్థ వ్యవహరించారు.సునీత, సమత, సంజన, సజన, కుందన, అక్షయ, షబ్నం, లిఖిత్ తదితరులు పాటల పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటారు.



రోలుగుంటలో...

**పెందుర్తి:** శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో ఆదివారం.కథలు చదవడం, రాయడం, చెప్పడంపై అవగాహన కల్పింఆచరు. కథా రచయిత , కార్టూనిస్ట్ హరి వెంకటరమణ విద్యార్థులకు చీమ పరుగు కథను చెప్పి, దానికి సంబంధించిన బొమ్మలను విద్యార్థులతో వేయించారు. గ్రంథాలయ అధికారిణి బి. సూర్యకళ, జడ్‌పి హైస్కూల్ టీచర్ జగదీష్, సామాజిక కార్యకర్త నరసింహారావు పాల్గొన్నారు.



పెందుర్తిలో...



పాయకరావుపేటలో..

## మూడేళ్లుగా గ్రంథాలయం మూత

ప్రజాశక్తి -అనంతగిరి:మండల కేంద్రంలోని గ్రంథాలయం మూడు సంవత్సరాల నుండి మూత పడింది. మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు జనరల్ నాలెడ్జికి సంబంధించిన, ఇతర పుస్తకాలు చదివేందుకు గ్రంథాలయంకు వెళ్లేవారు. ప్రతి ఏటా గ్రంథాలయం ఆధ్వర్యాన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసేవారు. గత మూడు సంవత్సరాల నుండి గ్రంథాలయం మూతపడటంతో ఇటు నిరుద్యోగ యువతీ యువకులు, అటు పాఠశాల, కళాశాలల విద్యార్థులు పలు రకాల పోటీలకు దూరమయ్యారు.మూతబడిన గ్రంథాలయాన్ని తెరిపించాలని మండల వాసులు కోరుతున్నారు.



గుర్తింపు కార్డులు సిద్ధం చేస్తున్న అధికారులు

## ఏజెంట్లకు గుర్తింపు కార్డులు సిద్ధం

ప్రజాశక్తి -నక్కపల్లి:కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డు లు ఇచ్చేందుకు, కార్డులు సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. పాయకరావుపేట నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల బరిలో 9 మంది అభ్యర్థులు పోటీలో నిలిచిన విషయం తెలిసిందే. అనకాపల్లిలో జూన్ 4న కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు కౌంటింగ్ ఏజెంట్లు 105 మంది, జనరల్ ఏజెంట్లు ఐదుగురికి గుర్తింపు కార్డులను ఆర్‌ఓ గీతాంజలి అందించనున్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఎలక్షన్ డిటి చైన్లు, ఇతర సిబ్బంది గుర్తింపు కార్డులను సిద్ధం చేశారు.



మాట్లాడుతున్న గ్రామస్తులు

## విద్యుత్ కోతలను అరికట్టాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని డొంకాడలో అప్రకటిత విద్యుత్ కోతలతో తీవ్ర అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేసారు. గత రెండు రోజుల నుండి వేళాపాలా లేకుండా విద్యుత్ కోతలు విధించడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కనీసం పశువులకు కూడా తాగునీరు అందించలేక పోతున్నామన్నారు. వెంటనే అధికారులు స్పందించి విద్యుత్ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. శనివారం రాత్రి కూడా సుమారుగా 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో పల్లె ప్రజలు చీకటిలో ఇబ్బందులు పడ్డారు.

## విద్యుత్ స్తంభానికి అల్లుకున్న చెట్ల కొమ్మలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో సంతబయిలు రామాలయం ఎదురుగా జిల్లా పరిషత్ బాలికల పాఠశాల వద్ద విద్యుత్తు స్తంభానికి వివిధ రకాల చెట్ల కొమ్మలు అల్లుకున్నాయి. ఈ తీగలు కారణంగా స్థానికులు ఆందోళన చెందుతున్నార. అధికారులు స్పందించి అల్లుకున్న తీగలను తొలగించాలని కోరుతున్నారు.



స్తంభాన్ని ఆవరించిన ఆకులు



రక్తదానం చేస్తున్న దాతలు

## రక్తదాన శిబిరానికి స్పందన

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం పెట్రోల్ బంక్ వద్ద సాయానికి పది రూపాయలు సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. వేసవికాలం ప్రభావంతో బ్లడ్ బ్యాంక్‌లలో రక్త నిల్వలు తగ్గిపోవడం, ఎండలతో దాతలు ఎవరూ ముందుకు రాకపోవడంతో రక్త కొరత ఏర్పడంతో క్యేన్సర్, తలాసేమియా రోగులు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నందున సాయానికి పది రూపాయలు సేవా సంస్థ సభ్యులు, యువకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చశారు. 105 మంది దాతలు రక్తాన్ని దానం చేశారు. సంస్థ సభ్యులు దాతలకు టిఫిన్, ఫ్రూట్స్, లంచ్ ఏర్పాటు చేశారు. సాయానికి పది రూపాయలు టీంను పలువురు అభినందించారు.



సత్కరిస్తున్న ముత్యాలనాయుడు

## స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ హర్షితకు సత్కారం

**ప్రజాశక్తి-చీడికాడ:**ఏపీ అగ్రికల్చర్ సెట్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రంలో ప్రథమ ర్యాంకు సాధించిన మతల హర్షితను ఘనంగా సత్కరించారు.చీడికాడ మండలం లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన మతల శ్రీను, దేవి దంపతుల కుమార్తె మతల హర్షిత ఏపీ అగ్రి సెట్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రంలో ప్రథమ ర్యాంకు సాధించినందుకు గాను నన్నయ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ముత్యాలనాయుడు ఎల్ఎన్‌పురం లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముత్యాల నాయుడు మాట్లాడుతూ, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని గ్రామానికి మంచి పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కన్నూరు శ్రీరామ్‌మూర్తి, డోకల అప్పలనాయుడు, జిఎం ప్రసాద్, జి శ్రీనివాస్ బొబ్బిలి మధు, కన్నబాబు పాల్గొన్నారు.

## కబ్జా స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

**ప్రజాశక్తి -అరకులోయ రూరల్:**మండలంలోని పెదల బుడు మేజర్ పంచాయతీ వెనక ప్రభుత్వ సులబ్ కాంప్లెక్స్ స్థలాన్ని ఓ గిరిజనేతరుడు కబ్జా చేసిన స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోని అతనిపై ఎల్‌టి ఆర్ కేసు నమోదు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, జిల్లా నాయకుడు కె రామారావు డిమాండ్ చేశారు. కబ్జా చేసి నిర్మాణం చేస్తున్న సులబ్ కాంప్లెక్స్ స్థలంలో ఆదివారం వెళ్లి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రభుత్వం సులబ్ కాంప్లెక్స్ కోసం కేటాయించిన స్థలాన్ని గిరిజనేతరుడు శివ కబ్జా చేసి దుకాణం నిర్మాణం చేస్తున్నారన్నారు. డ్రైనేజీ సైతం ఆక్రమణ చేసి దుకాణం నిర్మాణం చేస్తున్నారని, దీంతో మురుగు నీరు రోడ్లపైకి వచ్చి దుర్వాసన వస్తుందని చెప్పారు. ఈ విషయమై గతంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు నిలుపుదల చేశారని, మళ్లీ అక్రమ కట్టడాలు చేస్తున్నా పంచాయితీ, రెవిన్యూ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయవలసిన అధికారులే పట్టించుకోకపోతే ప్రభుత్వ స్థలాన్ని ఎవరు కాపాడతారని ప్రశ్నించారు. అధికారుల అండతోనే గిరిజనేతరుడు ప్రభుత్వ స్థలం కబ్జా చేసి దుకాణం నిర్మాణం చేస్తున్నారని విమర్శించారు. సులాబ్ కాంప్లెక్స్ స్థలం స్వాధీనం చేసుకోకుంటే కలెక్టర్, పిఒలకు పిర్యాదు చేస్తామన్నారు.

సమస్యల వలయంలో

# ఏరియా ఆసుపత్రి

**-మూడు సంవత్సరాలుగా పనిచేయని లిఫ్ట్**
**- కరెంటుపోతే చీకట్లోనే వైద్యం - వైద్యుల కోసం ఎదురుచూపు**



ఆసుపత్రిలో నూతనంగా ప్రారంభించిన భవనం



సెల్‌ఫోన్ వెలుగులో చేపడుతున్న వైద్యం (ఫైల్ )

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:**నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలోని పలు సమస్యలతో రోగులు సతమతం అవుతున్నారు. ఈ ఆసుపత్రి ఒకప్పుడు 20 పడకలతో ఉండేది. నేడు 150 పడకల ఉన్నప్పటికీ వైద్యం అందక దయనీయంగా మారింది. ఈ ఆసుపత్రికి రోజూ సుమారు 500 ఓపి వస్తుంది. ఆయా మండలాల నుండి రోగులు వస్తుంటారు. వంద మంది వరకు ఇన్ పేషెంట్లు ఉంటారు. ఏజెన్సీ ముఖ ద్వారం కావడంతో పేద గిరిజనులు ఇక్కడకు వైద్యం చేయించుకోవడానికి వస్తారు.

ఆసుపత్రిలో సుమారు మూడు సంవత్సరాలుగా లిఫ్ట్ పని చేయలేదు. కరెంటు పోతే చీకట్లో ఇంజక్షన్లు, వైద్యం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని సార్లు డీజిల్ లేకుంటే జనరేటర్ పనిచేయదు. దీంతో ఫ్యాన్ లు పనిచేయక రోగులు నానాఇక్కట్లు పడుతున్నారు.

ఆయా వైద్యుల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి ఉంటుందని రోగులు తెలిపారు. ఈ ఆస్పత్రిలో రూ.8.8 కోట్ల వ్యయంతో నిర్మించిన ఓపీ విభాగం ఇటీవల ఎమ్మెల్యే గణేష్ ప్రారంభించారు. భవనంలో వారంలో మూడు రోజులు సోమ, గురు, శనివారాలలో యూరాలజీ, నెఫ్రాలజీ, కార్డియాలజీ వైద్య నిపుణులతో ఓపీ నిర్వహిస్తున్నారు. ఈ వైద్యుల కోసం గంటల తరబడి ఎదురు చూసినా కొన్ని సార్లు కనిపించరని పలువురు రోగులు వాపోతున్నారు.

గుండె సమస్య ఉందన్న భయంతో కార్డియాలజీ డాక్టర్ కు చూపించుకుందామని ఏరియా ఆస్పత్రికి వచ్చానని, డాక్టర్ రాక పోవడంతో రెండు గంటల వరకు ఎదురు చూసి వెనుతిరిగామని నాతవరం మండలానికి చెందిన అనిమిరెడ్డి తాతాజీ తెలిపాడు.

స్పెషలిస్టులు ఉంటారన్న నమ్మకంతో ఎంతోమంది రోగులు వస్తే డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని స్థానిక వెంకునాయుడు పేటకు చెందిన శేషగిరిరావు తెలిపారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలను సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని రోగులు కోరుతున్నారు.



వేచివున్న రోగులు

# బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించండి

**ప్రజాశక్తి-పాడేరు :** ఈనెల 4 నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటి స్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు కె.వివేకానందన్, గజేంద్ర కుమార్ సింగ్ సూచించారు. ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అరకు, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం, అరకు పార్లమెంటు సిగ్మెంట్లకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ హాల్స్ ను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఎం.విజయ సునీత, పాడేరు రిటర్నింగ్ అధికారి, జెసి భావన వశిష్ఠ్ తో కలిసి పరిశీలకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కౌంటింగ్ సిబ్బంది అప్రమత్తంగా తమకు కేటాయించిన పనులలో ప్రధాన భూమికను పోషించి విధులను నిర్వర్తించాలని సూచించారు. ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని, ఎక్కడా పొరపాట్లు దొర్లకూడదని తెలిపారు. అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లను ఏజెంట్లకు చూపించాలని, వారినుంచి సంతకాలు తీసుకోవాలని చెప్పారు. ఈవిఎం మిషన్లను తీసుకువచ్చేటప్పుడు, ఓట్లను లెక్కించేటప్పుడు మిషన్లు పాడవకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత మాట్లాడుతూ, కౌంటింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేపట్టినట్లు పరిశీలకులకు వివరించారు. కౌంటింగ్ సిబ్బంది ఈ నెల 4వ తేదీ మంగళవారం ఉదయం 5 గంటలకే ఆయా కౌంటింగ్ కేంద్రాలకు కచ్చితంగా చేరుకోవాలన్నారు. విధుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా పూర్తిస్థాయి ఫలితాలు వెల్లడి అయ్యేవరకు బాధ్యతాయుతంగా తమ విధులను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని వివరించారు. ఇప్పటికే కౌంటింగ్ కేంద్రాలలో ఓట్ల లెక్కింపునకు సంబంధించి టేబుళ్లను సిద్ధం చేశామని 4 తేదీన ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందని దీనికి సంబంధించి వేరువేరుగా టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. కౌంటింగ్ కేంద్రాలకు కచ్చితంగా ఐడి కార్డులతో హాజరు అయ్యే విధంగా అవగాహన కల్పించామన్నారు. ఈవీఎంల కౌంటింగ్ కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్వై జర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఉంటారని, అదే విధంగా ప్రతి టేబుల్ వద్ద పోస్టల్ బాలెట్ కోసం ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, కౌంటింగ్ సూపర్ వైజర్ కౌంటింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలిపారు. ఈ పరిశీలనలో చింతూరు ఆర్డీఓ చైతన్య, డిఆర్ఓ బి.పద్మావతి, ఎస్డిసిలు అంబేద్కర్, వివిఎస్ శర్మ, తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకులు, కలెక్టర్